# అంతరాలు

ఉదయం పదకొండు గంటలైంది. వంటింట్లో పనంతా చక్కబెట్టుకుని హాల్లోకొచ్చి ఆరోజు దినపత్రికను చేతిలోకి తీసుకోబోతూ ఇంటిముందు ఆటో ఆగిన శబ్దమైతే బాల్కనీలోంచి కిందికి చూశాను. ఆగిన ఆటోలోంచి ఓ పల్లెటూరి పెద్దావిడా ఆమెతో పాటు ఆదినారాయణా క్రిందికి దిగేరు. పెద్దావిడకి సుమారుగా డెబ్బయ్ అయిదేళ్లుంటాయి. ఎర్రగా వున్నా వడిలిపోయినట్లుంది. నుదుట యాభైపైసల బిళ్లంత బొట్టు – ఇద్దరూ ఎదురుగా వున్న ప్రహారీగేటు తీసుకుని లోపలికి వెళ్లేరు.

ఆదినారాయణ మా యింటి ఎదురుగా వున్న ఖాళీస్థలంలో పాక వేసుకుని వుంటూ ఏడాదిన్నర అవుతోంది. ఆ స్థలం గలాయనకు దుబాయ్‌లో ఉద్యోగం. కుటుంబంతో పాటు అక్కడే వుంటాడు. ఇక్కడ యింటిస్థలం చవగ్గా కొని అది దురాక్రమణకు గురికాకుండా ముందుజాగ్రత్తగా ప్రహరీ, గేటూ ఏర్పాటుచేసి అందులో వాచ్‌మెన్‌గా ఆదినారాయణని తెచ్చివుంచేడు. సుమారు ఐదొందల గజాలుండే ఆ స్థలంలో ఓ మూలగా పాకవేసుకుని ఆదినారాయణ భార్య, యిద్దరు పిల్లలతో పాటు వుంటాడు. ఆదినారాయణ భార్య రత్నం మా యింటితో కలిపి నాలుగిళ్లలో పాచిపన్లు చేస్తుంది. ఆదినారాయణ కూలిపని చేస్తాడు. ఆ స్థలం యజమాని యిచ్చే కొద్దిపాటి జీతం అతని కుటుంబానికి ఎందుకూసరిపోదు. అయితే ఈ పాకకి అద్దెలేదు. జాగాలో నుయ్యి వుంది కాబట్టి నీటికరువు లేదు. ఇంట్లో యిద్దరూ కష్టపడి సంపాదిస్తున్నా యీ కరువురోజుల్లో యిల్లుగడవడమే కష్టమైపోతోంది.

అటువంటిది– ఆదినారాయణ ఆటోలో దిగడం నాకు ఆశ్చర్యాన్నే కలిగించింది.

హాల్లోకొచ్చి కూర్చుని, దినపత్రిక తెరచాను– ఉత్తరభారతంలో కొన్నిచోట్ల జరిగే ఎలక్షన్లలో రిగ్గింగూ; దక్షిణాదిన తుఫాను హెచ్చరిక; గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆందోళనలు.. అవినీతిపరులైన ఆఫీసర్లను పట్టుకొన్న సిబిఐ అధికార్లూ...... కేవలం హెడ్డింగులు మాత్రమే చదివి దాటేస్తున్న నాకు నాలుగోపేజీలోని వార్త ఆశ్చర్యాన్నే కలిగించి అక్కడ ఆగేను.

మహిళలకు కూడ ఆస్తిలో సమానవాటా కల్పిస్తూ హిందూవారసత్వ చట్టానికి తెచ్చిన సవరణను లోక్‌సభ ఏకగ్రీవంగా ఆమోదించిందట– కొడుకులకూ కూతుళ్లకూ మధ్య వివక్షతకు తావీయకుండా 1956 నాటి వారసత్వ చట్టాన్ని సవరించడం సర్వజన ఆమోదాన్ని పొందిందట. 1986లోనే ఆంధ్రదేశంలో ప్రవేశపెట్టబడిన యీ చట్టం యిప్పుడు దేశమంతటికీ వర్తింపజేస్తున్నారట. దీనివల్ల యింతవరకూ తమకున్న ఆస్తిపాస్తుల్ని తమ తదనంతరం కొడుకులకే సంక్రమింపజేస్తున్న తల్లిదండ్రులు యిప్పుడు వాటిల్లో సమానవాటా కూతుళ్లకు కూడ యివ్వాల్సి వస్తుంది– ఆడపిల్లకు పెళ్లిచేసి అంతటితో తమ బాధ్యత తీరిపోయిందనుకొన్న తల్లిదండ్రులు మాటల్లోనే కాక చేతల్లో కూడ తమ పిల్లలపట్ల సమానాభిమానాన్ని ప్రదర్శించాల్సి వుంటుంది. ఆడపిల్లంటే ఎప్పటికైనా ఆడపిల్లే గాని ఈడపిల్ల కాదనుకొనేవారికి యిది మింగుడుపడని సమస్యగానే తోచవచ్చు. ఇదేగనక అమలుజరిగితే కొందరి స్త్రీలకైనా కాస్తంత ఆర్థికస్వాతంత్ర్యం లభిస్తుందని విజ్ఞుల ఆలోచన. కానీ అది జరిగేనా అన్నదే ప్రశ్న!

వీధిలోంచి ఎవరో 'అమ్మగారూ' అని పిలుస్తుండటంతో లేచి వెళ్లి చూశాను. వీధికాల్వలు శుభ్రంచేసేవాడు గేటు దగ్గర నిలబడివున్నాడు.

"డబ్బులిచ్చి తుడిపించుకుంటారా.. వెళ్లిపోవాలా" అన్నట్లుంది వాడివాలకం. మున్సిపాలిటీవారికీ శానిటరీవాళ్లకీ ఒప్పందాలు కుదరక చాలారోజులుగా ప్రైవేటు వ్యక్తులకే ఆపని అప్పగించేరు– కాంట్రాక్టరు సరిగా జీతాలివ్వడం లేదని వారానికో పదిరోజులకో ఒకమారే వస్తారు రోడ్లు తుడిచేవాళ్లూ; మురిక్కాలువలు శుభ్రం చేసేవారూనూ. (మొన్న దసరాకి మాత్రం కలిసిగట్టుగానే వచ్చి మామూళ్లు దండుకొని మరీ వెళ్లారు. దీపావళి కూడ వెళ్లింది. మళ్లీ అయిపులేరు. అది వేరేసంగతి!) వాళ్లురాని రోజుల్లో కాలువలు నిండిపోయి దోమలబాధ భరించలేక ఏంచేయాలో తోచని స్థితిలో 'కాలువ శుభ్రం చేస్తాను. తోచింది యివ్వండి' అంటూవచ్చాడు వీడు. చిరుగుల ఫేంటూ; అతుకుల షర్టూ చేతిలో కాలువలోని చెత్తతీసే పనిముట్టుతో– అలా కుదురుకుని మూడ్రోజులకోమారు వచ్చి కాలువ శుభ్రంచేసి ఐదోపదో పట్టుకుపోతాడు.

వీధిలోకి వెళ్లి వాడికి డబ్బులిచ్చి వస్తూంటే ఆదినారాయణ మళ్లీ కన్పించేడు. ఒకచేతిలో పాలపోట్లాం; మరో చేతిలో అరంజ్ కలర్ కూల్‌డ్రింక్‌తో. ఈ మారు నాకు ఆశ్చర్యంతో పాటు ఆతృతకూడ కలిగింది..ఆ వచ్చిన పెద్దముత్తయిదువు ఎవరా అని–

లోపలికొచ్చి మిగతా దినపత్రికలోని వార్తలు చదవడం పూర్తిచేశానో లేదో ఫోన్ రింగయితే, తీశాను. వందన పిన్ని!

'ఏమైందే? మాట్లాడేవా? నువ్వేఫోన్ చేస్తావని చూస్తున్నాను."అంది. ఏం చెప్పాలో వెంటనే తోచలేదు. "నీకు చెబుతాగా" అంటూనే విషయం దాచేసి ఆ మాటా యీమాటా మాట్లాడి పెట్టేశాను.

ఒక్కమారు ఆలోచనలు చుట్టముట్టి.. వారంరోజుల వెనక్కి తీసుకెళ్లాయి.

◆ ❖ ◆

"పోనీ ఒక్కమారు మధుతో ఆ మాట కదిపిచూడు. నువ్వెలాగూ ఏదీ ఆశించటంలేదు. వాడేమంటాడో అదీ చూద్దాం" అంది వందన పిన్ని.

నాకెందుకో చిన్నప్పట్నించీ వందన పిన్ని అంటే గౌరవమూ అభిమానమూను. అమ్మ తర్వాత అమ్మంత ఆత్మీయంగా అభిమానంగా చూస్తుంది నన్ను. నా చిన్నప్పుడు పిన్ని మా యింటికొచ్చి ఓ నాలుగురోజులున్నది ఎప్పుడూ లేకపోయినా, స్కూలికి సెలవులిస్తేచాలు నన్ను వాళ్ల వూరు రమ్మనేది. వాళ్లింట్లో పిన్నిచూపిన అభిమానాన్నీ ప్రేమనీ నేను మర్చిపోలేను.

"సరే పిన్నీ. నువ్వు చెప్పేవు కాబట్టి అడుగుతాను. వాడేమన్నాడోమళ్లీ నీకు చెబుతాను. సరా." అన్నాను.

ఆ తర్వాత ఆ విషయమై నాలుగురోజుల పాటు చాల ఆలోచించాను.

వంటరిగానే ఆలోచించాను.

నాన్నని తల్చుకుంటే ఒక్కొక్కప్పుడు ఆశ్చర్యమేస్తుంది. అటువంటివారు యీ భూ ప్రపంచంమీద మరొకరు వుండివుంటారా అన్పిస్తుంది. ఇంట్లో ఎప్పుడూ నాన్నదే పై చెయ్యిగా వుండేది. అమ్మకెప్పుడూ ఏదో అనారోగ్యం. నా చదువును డిగ్రీతోనే ఆపేశాడు నాన్న. తనకింకా చదవాలని వుందని నోరు తెరిచి అడిగింది కూడ. ఆడపిల్ల పెద్దచదువులు చదివితే పెద్దపెద్ద సంబంధాలు చూడాలిట– కట్నాలు కూడా తగ్గట్టు గానే యివ్వాల్సి వస్తుందట– అందుకని మరొకరి యిష్టాయిష్టాలతో పనిలేకుండా నాన్న తనకునచ్చిన సంబంధం చూసి పెళ్లిచేసేశాడు.

రామ్‌నారాయణ గారికి తండ్రితప్ప మరెవరూ లేరు– సాధారణ ఉద్యోగం, మధ్యతరగతి జీవితం. కట్నకాన్కల విషయంలో పేచీలేదు– కోరికలసలే లేవు. అందుకే ఆయన నచ్చేడు నాన్నకి. పెళ్ళయ్యాక రామ్‌నారాయణ్ గారి వెంట ఎంతబీదగా నడిచివెళ్ళానో అప్పుడుకాదు ఆ తర్వాత తెల్సుకున్నపుడూ నా తోటి ఆడపిల్లలతో పోల్చిచూసుకున్నపుడూ బాధకలిగింది. నాన్న ఆ స్థితిలో వున్నపుడు నన్ను అంతబీదగా అత్తవారింటికి పంపాల్సిన అవసరం, అగత్యం లేదు. ఆ విషయం తల్చుకున్నపుడల్లా; తోటి మధ్యతరగతిపెళ్లయిన అమ్మాయిన్ని చూసినపుడల్లా నాన్నమీద కోపం ముంచుకొచ్చేది!

తనకోసం నాన్న ఏం ఖర్చుపెట్టాడనీ? ఆడపిల్ల పెళ్లిచేసి ఏ రకంగానూ యిబ్బంది పడలేదు– ఆ యేడాదే తమ్ముడు ఇంజనీరింగ్ చదువుతానంటే డొనేషన్ కట్టిమరీ యింజనీరింగ్‌లో చేర్పించేడు. వాడి చదువుకు ఒక సంవత్సరం ఖర్చుపెట్టినంత కూడ తన పెళ్లికి ఖర్చుకాలేదు–అది అందరికీ తెలిసిందే. తమ్ముడు ఇంజనీరింగ్ పూర్తిచేసిన సంవత్సరమే అమ్మపోయింది. సరైన వైద్యం చేయించకే ఆమె త్వరగా పోయిందని బంధువుల్లో చాలామందే అనుకున్నారు. ముఖ్యంగా చిన్నమావయ్య ఆయన ముఖంమీదే అన్నాడు కూడ!

నాన్న జగమొండి. ఎవరి మాటల్నీ లెక్కజేసే రకం కాదు. తనకేది తోస్తే అది– ఎంతతోస్తే అంత. అలా జరగాల్సిందే.

ఉద్యోగమొచ్చాక తమ్ముడికి గొప్పింటి సంబంధమే చూసి పెళ్ళిచేశాడు. కట్నకానుకలు లక్షల్లోనే వున్నట్లు తెల్సింది. ఆడబడుచుగా తనకుముట్టింది మాత్రం ఓ పట్టుచీర, ఐదువేల రూపాయలూను.

రిటైరైన తర్వాత తను వుంటున్న యింటిని అద్దెకిచ్చేసి తమ్ముడి దగ్గరకే చేరేడు నాన్న. అటు పెన్షను యిటు ఇంటద్దె రెండూ వచ్చేవి.

పెద్దమ్మాయికి పెళ్లికుదిరినపుడు ఆ సంగతి ఆనందంగా నాన్నకి ఫోన్‌చేసి చెబితే డబ్బు విషయం తప్ప మిగిలిన అన్ని విషయాలు మాట్లాడేడు. ఆ విషయం చెప్పి బాధపడితే "మనమ్మాయి పెళ్లిబాధ్యత మనది. మీ నాన్నదికాదు. డబ్బుంటే మాత్రం పెళ్ళయిన ఆడపిల్లకుపెట్టాలని ఎక్కడుంది?" అన్నారాయన. అప్పుడుకూడ రానికోపం, దుఃఖం పెళ్ళిపందిట్లో అందరి సమక్షంలో పెళ్లికూతురి తాతగారిగా ఒకదుద్దుల జత గొప్పగా చదివించినపుడు వచ్చింది. "లక్షల విలువజేసే ఆస్థికి యజమాని, మనవరాలి పెళ్లికిచ్చే బహుమతి అదేనా?" అని దగ్గర బంధువులంతా పందిట్లోనే అనుకున్నారు.

వందన పిన్ని మాత్రం మౌనంగానే వుండిపోయి అమ్మని తల్చుకుని కన్నీళ్లు పెట్టుకుంది. పెళ్లికోసం మేం చేసిన అప్పు విషయమై ఆమెకు బాగానే తెల్సు.

ఆర్నెల్లు గడవలేదు– నాన్నకి హార్ట్ఎటాక్ వచ్చింది అపోలోలో అడ్మిట్ చేశానంటూ తమ్ముడు ఫోన్‌చేస్తే రెక్కలు కట్టుకొని వెంటనే బయల్దేరి వెళ్లాం, ఆయనా నేనూ.

స్పెషల్‌వార్డులో రాజవైభవంగా వుందాయన పరిస్థితి.

'వచ్చేవా' అన్న పలకరింపు తప్ప మారుమాట లేదు. సంతోషంలేదు. రెండురోజులుండి వచ్చేశాం. హాస్పిటల్ బిల్లు సుమారు ఎనభైవేల వరకూ అయిందని తర్వాత ఫోన్‌చేసి చెప్పాడు తమ్ముడు– ఆ విషయమై నేనేం మాట్లాడలేదు–

ఆ తర్వాత ఏడాది ఆరోగ్యంగానే వున్నాడు– రెండునెలలనాడు నిద్దట్లోనే పోయాడన్నవార్త!

రోజులు ఎంతలో గడవాలి? ఈ మధ్యకాలంలో వందన పిన్ని రెండుమార్లు

వచ్చివెళ్లింది– మా యింటి పరిస్థితులన్నీ పిన్నికి తెల్సు– నన్నూ నా పరిస్థితినీ అర్థం చేసుకుని ఆత్మీయంగా మాట్లాడే ఒకే ఒక వ్యక్తి పిన్ని. ఆమె దగ్గర దాపరికాలు లేవు. పెద్దదాని పెళ్లికి డబ్బు ఎక్కడనించి వచ్చిందో చిన్నదాని ఇంజనీరింగ్ చదువుకూ అక్కడ్నించే తేవాల్సివచ్చింది. నెలనెలా వచ్చే జీతంలో కట్టాల్సిన వడ్డీలుపోతే రోజులుగడవడమే కష్టమనిపిస్తుంది.

"చవకరోజుల్లో నీ పెళ్లిచేసేడు. కట్నంకూడ అట్టేలేదు– నీకేం యిచ్చేడని మీ నాన్న? నిజానికి ఆస్థిలో నీకూ వాటా వుంటుంది– హక్కుగా నువ్వు అది అడక్కపోయినా బాధ్యతగా ఆయనా ఎంతోకొంత నీకుయివ్వాలి. అది న్యాయం కూడ. బతికున్నన్నాళ్లూ ఎటూ లేదు– కనీసం పోయే ముందైనా ఆలోచించాడేమో.. ఈ విషయమై తమ్ముడు మాట్లాడకపోతే నువ్వే కదిపిచూడు. లేదా నన్ను మాట్లాడమన్నా మాట్లాడతాను." అంది వందన పిన్ని.

"వద్దు పిన్నీ. ఈ గొడవలన్నీ నీకెందుకు? నేనే మాట్లాడతానుగా" అన్నాను.

ఎలాగైతేనేం.. నాలుగురోజుల పాటు ఎన్నో రిహార్సల్ వేసుకుని చివరికి ఆ విషయాన్ని తమ్ముడి ముందుపెట్టేను ఓ చిన్న ప్రశ్నరూపంలో– దానికి తమ్ముడిచ్చిన సమాధానం సుమారుగా నేనూహించిందే–

"నేనే యీ విషయం నీతో మాట్లాడాలనుకుంటున్నానక్కా. నీకు తెల్సుగా..పాతికేళ్ల క్రితం ఆ యింటిని నాన్న యాభైవేలకు కొన్నాడు. ఇప్పుడు దాని విలువెంత వుంటుందో తెలీదు– ఇంటికి వేరే వేల్యూ లేకపోయినా స్థలం ఖరీదు మూడునాలుగు రెట్లు పెరిగివుంటుంది– పోయేముందు ఏ విషయమూ చెప్పకపోయినా తనతదనంతరం ఆ ఇల్లు నాకు సంక్రమించేటట్లూ; బేంకు డిపాజిట్లు నీకు చెందేట్టూ తన డైరీలో రాసేడునాన్న. దాన్నే ఆయన మాటగా తీసుకోవాలిగదా. బేంకు డిపాజిట్లు అన్నీ కలిపితే యాభైవేలుంది– దానిమీద మరో పాతికవేలు వేసి నీకు పంపుదామనుకొంటున్నాను. మీ ఇద్దరిలో ఎవరిపేర్న పంపమంటే వారిపేర్న "డ్రాఫ్టు పంపుతాను" అన్నాడు. బంధం తెగకుండా తనకు నష్టం జరగకుండా లౌక్యంగా చెప్పేడు.

ఆయనతో యీ విషయమింకా చెప్పలేదు. చెప్పినా ఆయన ఆతృతచూపరు. ఆలోచించుకోవాల్సింది నేనే! పిన్ని చెప్పినట్లు నాన్న యిల్లు, స్థలం కలిపి ఎలా లేదన్నా యిప్పుడు పదిలక్షలు చేస్తుంది. చుట్టూ పెద్దపెద్ద హోటళ్లూ, బేంకులూ కొత్తగావచ్చేయి. ఆ విషయం తమ్ముడికీ తెలియాలి. అయినా అలా అన్నాడంటే... ఉద్దేశం అర్థమౌతూనే వుంది.

"పోస్ట్" అన్న కేకతో ఆలోచనల్లోంచి లేచాను. తిరుమలతిరుపతి దేవస్థానం నుండి 'సప్తగిరి' పత్రిక పోస్టులో వచ్చింది. టైంచూస్తే పన్నెండున్నర– భోజనం చేసివచ్చి తీరుబడిగా పుస్తకం చదువుకోవచ్చునుకుని లేచి భోజనం ముగించుకుని వచ్చాను.

సరిగ్గా అప్పుడే గేటు తీసుకుని వచ్చింది ఆదినారాయణ భార్య రత్నం.

"ఏం రత్నం?" అన్నాను తలుపు తీసి.

చిన్న నవ్వు నవ్వి; యిబ్బంది పడుతున్నట్టు తలొంచుకుంది.

“ఏంవిటీ చెప్పు.”అన్నాను రెట్టిస్తూ.

“మరేన్లేదమ్మా. అడిగాననిఅనుకోకండి. మా ఆడబడుచు వొచ్చిందిగదా. కాసింత ఊరగాయ యిచ్చినారంటే...” అంటూ కొంగుచాటునించి జర్మన్ సిల్వర్ గిన్నెను బయటకు తీసింది-

“..అలాగేలే“అంటూ లోపల్నించి తెచ్చియిచ్చి;

“ఇంతకీ మీ యింట్లో ఏంవిటి విశేషం?” అంటూ అడిగాను.

విషయమంతా నాలుగు ముక్కల్లో చెప్పి వెళ్లిపోయింది రత్నం. అంతకు ముందు అప్పుడూ అప్పుడూ వారి కుటుంబ విషయాలు చెప్పివుండటం వల్ల విషయం వెంటనే అర్ధమైపోయింది-

అయితే నేనున్న ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వారి కుటంబ కథా, ఒకరిపై ఒకరికి గల ప్రేమాభిమానాలూ నాలోకొత్త ఆలోచనలకు తావిచ్చాయి.

ఆదినారాయణకి అన్నదమ్ములేరు. ఉన్నదొక్కతే తోబుట్టువు- అక్కగారు. వారిద్దరి మధ్యా వయసులో తేడా కూడ ఎక్కువే. ఆదినారాయణకి పదిహేనేళ్లు వచ్చేసర్కే తల్లిపోవడం వల్లా, ఉన్న వూళ్లోనే అక్క వుండటం వల్లా, తండ్రిదగ్గరకన్నా అక్కాబావల దగ్గరే ఎక్కువ సమయం గడిపేవాడు.

ఆ కుటుంబంలో చదువుకున్నవాళ్లు ఎవరూ లేరు- ఆదినారాయణ చదువుకూడ అయిదో తరగతితోనే ఆగిపోయింది. కొన్నాళ్లు అల్లరిచిల్లరిగా తిరిగినా సరియైన వయసులో తనతోపాటు వ్యవసాయపనులు చేయడానికి తీసుకుపోయాడు తండ్రి. తండ్రిపోయాక, కరువువల్ల పంటలుపండక వ్యవసాయ పనులులేక కూలిపనులుకోసం, బతుకు తెరువు కోసం, పట్నంవైపు చూపు సారించేడు ఆదినారాయణ. కొన్నాళ్లు అద్దెకు రిక్షా తీసుకుని తొక్కేడు. కొన్నాళ్లు నీటిఎద్దడి ప్రాంతంలో నీళ్లకావిడమోసేడు. అప్పుడు గాని అతనికి చదువువిలువ తెలియలేదు- అప్పటికే మించిపోయింది. ఏమైనాసరే మళ్లీ పల్లెకు పోదల్చుకోలేదతడు. కష్టపడ్డా నాలుగుడబ్బులు కళ్లజూస్తున్నాడిక్కడ. పల్లెల్లో పంటలూలేవు. పనులూలేవు. సంపాదనా లేదు.

‘పట్నంలో వంటరిగా ఎన్నాళ్లు బతుకుతావు?’ అంటూ పెళ్లిచేసి అతనికో తోడును కుదిర్చి; “బతుక్కోసం ఎక్కడికన్నా పోకతప్పదు. కానీ సొంతూర్నీ సొంతమనుషుల్నీ మాత్రం మర్చిపోకు.”అని చెప్పింది అతని అక్క.

“అక్కంటే నీ తోడబుట్టింది. ఈ యింటి ఆడబడుచు. లక్ష్మిందేవి. అమ్మ తర్వాత అంత ప్రేమగా అభిమానంగా చూసుకొనేది అక్కే. ఆమె మనసుకు కష్టం కలిగించకూడదు.” అంటూ తండ్రి అవసానదశలో చెప్పిన మాటలు ఆదినారాయణకు వేద వాక్యాలయ్యేయి. పట్నంలో కాపురం పెట్టిన సంవత్సరమే తండ్రి తనకోసం మిగిల్చిన కమ్మల చుట్టునింటిని

బావ వద్దంటున్నా అక్కగారి కిచ్చేసి చక్కా వచ్చేడు.

పెళ్లయి వచ్చిన ఆదినారాయణకు మొదట బిల్డింగులు కట్టే కంట్రాక్టరు దగ్గర రోజువారీ పనిదొరికింది. కానీ అది కొద్దిరోజులే అయింది- పనుంటే కూలి. లేకుంటే లేదు. ఆ తర్వాత యిదిగో యీ వాచ్‌మన్ ఉద్యోగం. ఉండటానికి ఉచితంగా ఓ పాక, నెలనెలా జీతం. దొరికిన నాడు కూలిపని ఉండనే వుంటుంది. జీవితం ఒక దారిన పడ్డట్టనిపించింది ఆదినారాయణకి. అక్క మాట ప్రకారం ప్రతి సంక్రాంతికీ స్వంతవూరు వెళ్లేవాడు. ఒకరోజో రెండురోజులో వుండేవాడు. తన పట్నవాసపు సంసారాన్ని చూడ్డానికి రమ్మని అక్కనీ బావనీ కోరేవాడు.

◆ ❖ ◆

నాలుగురోజులు గడిచాయి.

ఆరోజు సాయంత్రం సన్నజాజిపూలు కోసుకుంటూంటే వచ్చింది రత్నం. వచ్చి కాస్త దూరంగా నిలబడిపోయింది.

"ఏఁవిటి రత్నం" అన్నాను మామూలుగా.

"ఏట్నేదమ్మా" అని కాస్సేపు తటాపటాయించి, "మిమ్మల్ని అడగాలంటే నోర్రాటం లేదు- కానీ తెల్లార్లేచి మీకాడ పనిచేసేవోళ్లం. మీతో కాకపోతే మరెవరితో సెప్పుకుంటాం?" అంది.

రత్నం ఏదోఅవసరమై వచ్చినట్లు అర్థమైంది.

"ఏఁవిటో చెప్పు." అన్నాను-

"మరేట్నేదమ్మా. పెద్దావిడ రేపు పెయానమౌతంది. రాకరాక వచ్చిన అక్కగారికో మంచి సీరెట్టాలని ఆదినారాయణ కోరిక. సీరకి నాలుగొదేలేనా అవుద్ది. సేతిలో రూపాయి లేదు- ఆదినారాయణకి నాల్రోజులై పనిలేదు-" అంటూ కాస్సేపాగి, "ఈ రోజు కాకపోతే రేపు సేతిలో డబ్బున్నరోజున ఆయమ్మ మళ్లీ రమ్మంటే వస్తుందా" అంది-

విషయం అర్థమైంది. తాహతకు మించి పెట్టుబడులు నాకు నచ్చవు. అందుకే కాస్సేపు మౌనం వహించాను.

"ఈ సారి యీ ఆపదని మీరే గట్టెక్కించాలమ్మా. నా జీతంలోంచి రెండునెలల్లో మినహాయించుకోండి" అంది నెమ్మదిగా.

అలా తీసుసుకుంటే నెలకీ దానికి వెళ్లేది ఏముంటుంది? ఏంచెప్పాలో పాలుపోక,

"నా దగ్గర అంత సొమ్ము వుండదు రత్నం. బాబుగారు రానీ, అడిగి, వుంటే యిస్తాను." అన్నాను. అప్పటికి తప్పించుకోవాలని-

రత్నం కాస్సేపు మౌనంగా నిలబడి "బాబుగారొచ్చినాక వస్తానమ్మా" అంటూ వెళ్లిపోయింది.

ఆయనొచ్చాక చెబితే– "పోనీ యివ్వు. నమ్మకంగా పనిచేస్తోందా గదా" అన్నారు. నిజానికి యీ పట్నాల్లోని పనివాళ్లకి నెలతిరక్కుండా జీతం డబ్బులు అడ్వాన్సుగా పట్టుకుపోవడం అలవాటైపోయింది. కానీ రత్నం ఆ తరహామనిషికాదు.

వెంటనే రత్నాన్ని కేకేశాను. డబ్బుతీసుకుంటున్న దాని ముఖంలో ఆనందం చూడాలి.

"ఇన్నాళ్ల కామెకు తీరికైవచ్చిందమ్మా– ఆయమ్మ మా యింట అడుగిడితేనే సౌభాగ్యమంటాడు ఆదినారాయణ. ఎంతైనా రక్తసంబంధం గదా. పెద్దావిడ జీవితంలో ఒకరికి పెట్టడమే గాని ఒకరికాడ తీసుకోవడం తెలీని గొప్పమనిషి. ఆమెకు మావేం మర్యాదలు చెయ్యగలం; ఏదో మా శక్తికొద్దీ యిలా".... అంది రత్నం.

ఆ బంధాల వెనక నున్న అభిమానాలకు అబ్బురమనిపించింది.

నాగరికత పెరిగి, స్వార్థం, కుటిలత్వం మనిషి నరనరాల్లోనూ పాకుతూ సోదర ప్రేమను సైతం వ్యాపారబంధంగా మార్చుకుంటూ మనుషులు బతుకుతున్న యీ రోజుల్లో ఆదినారాయణ చూపే ఆ అభిమానం స్వచ్ఛమైన ప్రేమాభిమానాలకు మచ్చుతునకే అన్పించింది.

బరువు బాధ్యతలు సమానవే అయినా మనుషుల అభిమానాల్లోనూ ఆలోచనల్లోనూ ఎంత తేడా!

జీవితావసరాలూ అభిమానాలూ వీటి మధ్య నలుగుతూ మనసులోంచి బయటపడకుండా సతమతమౌతూన్న సమస్యకేదో పరిష్కారం దొరికినట్లయింది.

ఒక నిశ్చయానికొచ్చాక మనసు తేలిక పడింది.

ఆ రాత్రే మధుకి ఫోన్ చేసి మాట్లాడేను. మనస్ఫూర్తిగా ప్రేమపూర్వకంగా నే చెప్పిందానికి "నీ ఇష్టం అక్కా" అని తప్ప మరో మాట మాట్లాడలేదు మధు. ఆ వెంటనే వందన పిన్నికి ఫోన్ చేశాను.

"మాట్లాడేవా" ఏమన్నాడు మధు? అడిగింది పిన్ని ఆత్రంగా.

ఎంతైనా పిన్ని కూడ ఆడదేగా!

"మాట్లాడేను పిన్నీ. ఏమైనా మధు నాకంటె చిన్నవాడు. ఇంకా నెరవేర్చవలసిన బాధ్యతలున్నవాడు– ఆడపిల్ల–ఆస్తులు చట్టాల మాటెలా వున్నా నాన్న యిష్టాన్ని కూడ గౌరవించాలి కదా.." అంటూన్న నా మాటకు అడ్డొచ్చి

"బోధపడిందిలే. అందుకే మనం యిలా వున్నాం" అంటూ అవతల ఫోన్‌పెట్టేసింది పిన్ని.

◆ ❖ ◆